సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 25 । ఫిబ్రవరి । 2024




సేవాగుణం, దైవభక్తి కలిగి ఉండాలి IIలో

సేవాగుణంకలిగి ఉండాలని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ప్రతినిధి రత్నాకర్ సూచించారు.



విద్యార్థులకు సత్వర వైద్యం

వైరల్ జ్వరాలు సోకిన విద్యార్థులకు సత్వరవైద్యం అందేలా పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ చర్యలు తీసుకున్నారు. IIలో



కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి శనివారం నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

వైవీ సుబ్బారెడ్డికి అభినందనల వెల్లువ



సుబ్బారెడ్డికి అభినందనలు తెలుపుతున్న జెడ్పీ, జీసీసీ చైర్‌పర్సన్లు, పాడేరు ఎమ్మెల్యే

సాక్షి,పాడేరు: రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. ఆయనకు స్వాగతం పలికేందుకు శనివారం విశాఖ ఎయిర్‌పోర్టుకు జిల్లా నుంచి నేతలు తరలివెళ్లారు. ఉమ్మడి విశాఖ జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జీసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

జీడిమామిడికి గిట్టుబాటు ధర కల్పిస్తాం

రంపచోడవరం: జీడిమామిడికి గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. పీవో తన చాంబర్‌లో శనివారం ఉద్యాన,వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మార్కెట్‌లో జీడిమామిడి ధరలపై చర్చించారు. ఏజెన్సీలో లభ్యమయ్యే జీడిమామిడి పిక్కల వివరాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు. జీడిపిక్కల కొనుగోలులో ఎన్జీవోలతో కలిసి పనిచేయాలన్నారు. రైతులకు ఎక్కువ రేటు వచ్చేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఈ ఏడాది మార్కెట్ రేటు ఎలా ఉంటుంది, ఎంత రేటు రావచ్చు తదితర అంశాలపై పీవో చర్చించారు.

కాంస్య పతక విజేతకు సత్కారం



కాంస్య పతక విజేత మధుచందనతో పీవో కావూరి చైతన్య

చింతూరు: అండర్–17 జాతీయ స్కూల్ గేమ్స్ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యపతకం సాధించిన గుత్తుల మధుచందనను చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య శనివారం సత్కరించారు. ఈ పోటీల్లో మధుచందన ప్లస్ 81 కేటగిరీలో కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ మధుచందన మంచి ప్రతిభ కనబరుస్తూ పతకాలు సాధించడం మన ప్రాంతానికి ఎంతో గర్వకారణమన్నారు. స్థానిక యువత ఆమెను స్ఫూర్తిగా తీసుకుని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. మధుచందన విజయంలో కీలకపాత్ర పోషించిన కోచ్ గంగాధర్, తండ్రి శ్రీనివాసరావును పీవో అభినందించారు.

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ పర్యటన రేపు

సాక్షి,పాడేరు: జిల్లాలో ఈనెల 26న ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారామ్ పర్యటించనున్నారు.అదే రోజు ఉదయం 8గంటలకు వారు పాడేరు చేరుకుని మోదకొండమ్మ తల్లిని దర్శించుకుంటారు.అనంతరం కాఫీ అతిథి గృహంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, సిబ్బందితో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహిస్తారు. మధ్యాహ్నం భోజన విరామం అనంతరం గిరిజన సంక్షేమశాఖకు చెందిన పలు ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలను వారు తనిఖీ చేస్తారు. సాయంత్రం మంగళగిరికి తిరుగు ప్రయాణం అవుతారని కలెక్టరేట్‌కు సమాచారం అందింది.

సీనియర్ల సీటుకు ఎసరు.!

- టీడీపీ తొలి జాబితాలో పార్టీ విధేయులకు మొండి చెయ్యి
- గంటా, పల్లా, బండారుకు దక్కని ప్రాధాన్యం
- పీలాకూ మొండి చెయ్యి.. దాడి కుటుంబానికి దెబ్బ
- కార్యకర్తలకు సైతం అందుబాటులోకి రాని సీనియర్లు
- గణబాబుకు సీటు కేటాయింపుపై 'పశ్చిమ'లో గరం గరం
- విశాఖ పార్లమెంటరీ టీడీపీ ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ రాజీనామా



మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణకు టికెట్ దక్కకపోవడంతో అనకాపల్లిలో ఆందోళన చేస్తున్న టీడీపీ శ్రేణులు

సాక్షి, విశాఖపట్నం : నమ్మిన వారిని నట్టేట ముంచడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని మరోసారి నిరూపితమైంది. పార్టీని అంటిపెట్టుకొని.. భుజాలపై మోస్తున్న సీనియర్లను కరివేపాకులా తీసి పడేశారు. పొత్తులో భాగంగా జనసేనతో కలిసి తొలి విడత విడుదల చేసిన జాబితా.. సీనియర్లలో కుంపటి రాజేసింది. సీనియారిటీని దృష్టిలో పెట్టుకొని మొదటి జాబితాలో తమ పేర్లు ఉంటాయని భావించిన వారంతా.. చంద్రబాబు కుతంత్ర రాజకీయాలకు బలయ్యారు. మొత్తం 94 మంది అభ్యర్థుల లిస్టులో తమ పేర్లు లేకపోవడంతో కంగుతిన్నారు. నిన్నా మొన్న పార్టీలోకి వచ్చిన వారికి సీట్లు కేటాయించడంపై సీనియర్లు అవాక్కయ్యారు.

అందరిదీ అదే పరిస్థితి..!

- ముందుగా ఊహించినట్లుగానే గంటా శ్రీనివాసరావును పొమ్మనలేక పొగపెట్టినట్లుగా చంద్రబాబు వ్యవహరించారు. సీటు మార్పు అంటూ ఊహాగానాలు వచ్చినా.. చివరికి ఆయన పేరు ప్రస్తావన లేకుండానే తొలి జాబితా సాగిపోయింది. గత ఎన్నికల్లో శ్రీకాకుళం నుంచి ఉభయ గోదావరి జిల్లాల వరకూ అన్నీ తానై వ్యవహరించిన గంటాకు మొండి చెయ్యి చూపించడంతో కేడర్ భగ్గుమంటోంది. జాబితా విడుదలైన తర్వాత గంటా ఇంట్లో ఒంటరిగా ఉండిపోయారు. ఒకరిద్దరు సన్నిహితులతో మాత్రమే మాట్లాడిన గంటా.. కేడర్, పార్టీ శ్రేణులు ఇంటికి వచ్చినా.. తర్వాత కలుద్దామని చెప్పి పంపించేశారు.
- విశాఖ టీడీపీకి పెద్ద దిక్కుగా వ్యవహరించిన మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తికీ తొలి జాబితాలో చోటు దక్కకపోవడంతో ఆయన మొహం చాటేశారు. పెందుర్తి సీటు పొత్తులో భాగంగా జనసేనకు ఇస్తారని ముందుగానే ప్రచారం చేశారు. అయితే.. పెందుర్తి సీటు కచ్చితంగా తనకు గానీ, కుమారుడికి గానీ ఇవ్వాలని ఇటీవల పర్యటించిన చంద్రబాబు, లోకేష్ ఇద్దరికీ బండారు విజ్ఞప్తి చేశారు. కానీ.. ఈ సీనియర్‌ని కూడా పక్కన పెట్టేలా వ్యవహరించడంతో.. కేడర్ మూగబోయింది. ముఖ్యనేతలతో సమావేశమైన బండారు.. మరోసారి అధిష్టానంతో తాడో పేడో తేల్చుకోవడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం.
- విశాఖ పార్లమెంటరీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుదీ అదే పరిస్థితి. 2019 ఎన్నికల్లో పల్లాని చంద్రబాబు పోటీలో నిలబెట్టినా.. గాజువాక నుంచి పవన్ పోటీ చేస్తున్నందున ప్రచారం కూడా చెయ్యొద్దంటూ హుకుం జారీ చేశారు. నగరంలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రచారం చేసిన చంద్రబాబు.. గాజువాక రాకపోయినా పట్టించుకోని పల్లా.. పార్టీని కాపాడుకునేందుకు నాలుగున్నరేళ్లుగా కష్టపడుతున్నారు. అయినా.. పల్లాకు సీటు గ్యారెంటీ లేదని అధిష్టానం చెప్పకనే చెప్పింది. మరోసారి అధిష్టానంతో మాట్లాడి.. సీటు ఉంటుందా.. లేదా అనేది క్లారిటీ వచ్చిన తర్వాత.. భవిష్యత్తు కార్యాచరణ ఏంటనేది నిర్ణయించుకుందామని తన అనుచరగణంతో పల్లా చెప్పినట్లు తెలుస్తోంది.
- పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు కనీసం పట్టించుకోని గణబాబుకు మరోసారి పశ్చిమ సీటు కేటాయించడంపై పార్టీలో అసమ్మతి జ్వాలలు చెలరేగుతున్నాయి. గణబాబుకు ఈసారి టికెట్ ఇవ్వొద్దంటూ పార్టీ సీనియర్లు తిరుగుబావుటా ఎగరేసినా.. పట్టించుకోకుండా టికెట్ ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసేశారు. టీడీపీలో అడ్డగోలు రాజకీయాలు జరుగుతున్నాయంటూ సన్నిహితుల వద్ద వాపోయారు. ఏ పార్టీలో చేరుతాననేది త్వరలోనే చెబుతానని ప్రకటించారు.
- అనకాపల్లిలో పార్టీకి పునాదిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణకు కూడా చేదు అనుభవం ఎదురైంది. ఏడాదిన్నర క్రితం జరిగిన నియోజకవర్గ సమీక్షలోనూ పీలాకే టికెట్ అన్నట్లుగా చంద్రబాబు సంకేతాలిచ్చి.. చివరి నిమిషంలో జనసేన తరఫున కొణతాల రామకృష్ణకు టికెట్ కేటాయించడంపై ఆయన అభిమానులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబితా ప్రకటించిన వెంటనే పార్టీ కార్యాలయం వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. అధిష్టానం పునరాలోచన చేయకుంటే తమ నాయకుడు ఇండిపెండెంట్‌గా పోటీ చేయడం ఖాయమని స్పష్టం చేశారు.
- వలస పక్షుల్లా.. ఆ గూటికీ.. ఈ గూటికీ తిరుగుతూ ఉండే దాడి వీరభద్రరావు కుటుంబం.. నెల రోజుల క్రితం చంద్రబాబు హామీతో టీడీపీ పంచన చేరారు. బాబు చేసే మోసాల గురించి పూర్తిగా తెలిసినా.. దాడి ఫ్యామిలీ మరోసారి భంగపాటుకు గురైంది. తనకు గానీ.. కుమారుడు రత్నాకర్‌కు గానీ టికెట్ ఇస్తానని చెప్పి.. నమ్మించి గొంతు కోశారంటూ దాడి వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. వైరి వర్గంగా భావించే కొణతాలకు టికెట్ ఇవ్వడంపై తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు.
- నమ్మక ద్రోహానికి నిలువెత్తు రూపం చంద్రబాబు అంటూ టీడీపీ సీనియర్ నాయకులు అనుచర వర్గాలు దుమ్మెత్తి పోస్తున్నాయి. బాబు కొట్టిన దెబ్బకు భవిష్యత్తు కార్యాచరణపై సీనియర్లంతా సమాలోచనలు చేస్తున్నారు.

జనసైన్యం.. నైరాశ్యం!

- కొణతాలకు అనకాపల్లి సీటు ప్రకటనతో రేగిన చిచ్చు
- తొలి జాబితాపై రగిలిపోతున్న సీనియర్లు, ఆశావహులు
- అధ్యక్షుడు పవన్ తీరుపై తీవ్ర అసంతృప్తి

సాక్షి, విశాఖపట్నం: ఎన్నో రోజుల నుంచి ఊరిస్తున్న టీడీపీ–జనసేన ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితా జనసైన్యాన్ని తీవ్ర నైరాశ్యంలోకి నెట్టేసింది. ఒకపక్క పార్టీ ఆవిర్భావం నుంచి పని చేస్తున్న వారికి కాదని నిన్నగాక మొన్న చేరిన మాజీ మంత్రి కొణతాల రామకృష్ణకు అనకాపల్లి సీటు ప్రకటించడం, మరోపక్క పొత్తులో కేవలం 24 స్థానాలే జనసేనకు కేటాయించడం వీరిలో తీవ్ర ఆగ్రహానికి గురి చేస్తోంది. చంద్రబాబు కోసం తమను బలి పశువులను చేశారంటూ వీరు లోలోన రగిలిపోతున్నారు. పరుచూరి భాస్కరరావు ఆరేళ్ల నుంచి అనకాపల్లి సీటును ఆశిస్తూ అక్కడ పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆయన భారీ మొత్తంలో చేతి చమురు వదిలించుకున్నారు. ఇటీవల నాగబాబు అనకాపల్లిలో నిర్వహించిన సభకు, కశింకోట మండలం విస్సన్నపేట భూముల కేటాయింపు వ్యవహారాల్లో ఆందోళనకు అవసరమైన సొమ్మును ఆయనతోనే ఖర్చు పెట్టించారని చెబుతున్నారు. దీంతో అనకాపల్లి జనసేన అభ్యర్థి ఆయనేనన్న భావన అందరిలోనూ నెలకొంది. ఇంతలో కొద్ది రోజుల క్రితం పార్టీలో చేరిన కొణతాలకు అకస్మాత్తుగా సీటు కేటాయించడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోతున్నారు. ఇలా తనను ఆర్థికంగా వాడుకుని అన్యాయం చేశారని అనుచరుల వద్ద చెప్పుకుని కన్నీటి పర్యంతమవుతున్నట్టు తెలిసింది.

'సిద్ధం' సభలతో ప్రతిపక్షాల గుండెల్లో గుబులు



బైక్ ర్యాలీలో అధిక సంఖ్యలో హాజరైన పార్టీ శ్రేణులు



బైక్ ర్యాలీలో పాల్గొన్న సమన్వయకర్త విశ్వేశ్వరరాజు, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెట్టి పాల్గుణ
- పాడేరులో భారీ ర్యాలీ

పాడేరు : వైఎస్సార్‌సీపీ నిర్వహిస్తున్న సిద్ధం సభలకు హాజరవుతున్న జనాలను చూసి ప్రతిపక్ష పార్టీలైన టీడీపీ, జనసేన నాయకుల్లో గుండెల్లో గుండెల్లో గుబులు పుడుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. శనివారం పాడేరు పట్టణంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సెయింటాన్స్ పాఠశాల నుంచి అమ్మవారి గుడి, పాత బస్టాండ్ మెయిన్ బజార్, సాయిబాబా గుడి, సుండ్రుపుట్టు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, లోచలిపుట్టు, సినిమా హాల్ సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా తలారిసింగి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. జై జగన్, జై జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. చెట్టి పాల్గుణ, విశ్వేశ్వరరాజు అభివాదం చేస్తూ పార్టీ శ్రేణులను ఉత్సాహపరుస్తూ ముందుకు సాగారు. సుమారు ఐదు కిలోమీటర్ల మేర ర్యాలీ సాగింది.



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న చెట్టి పాల్గుణ, సమన్వయకర్త విశ్వేశ్వరరాజు

వైఎస్సార్‌సీపీదే విజయం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి అత్యధిక విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. శనివారం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పాల్గుణ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో ఉండేందుకు పార్టీ కార్యాలయం ఏర్పాటు చేయడం శుభపరిణామని ఆయన పేర్కొన్నారు. మండల పార్టీ అధ్యక్షులు సీదరి రాంబాబు, మత్స్యకొండం నాయుడు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు కూడా సురేష్‌కుమార్, కిల్లు కోటిబాబు నాయుడు, మాజీ ఎంపీపీలు ఎస్వీ రమణమూర్తి, వంతాల బాబూరావు, వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డౌనూరు ఆశ్రమ ఉపాధ్యాయుడు సస్పెన్షన్

విధుల్లో నిర్లక్ష్యంపై గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ వెంకట మురళి ఆగ్రహం

కొయ్యూరు: విధుల్లో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డౌనూరు బాలుర ఆశ్రమ పాఠశాల సోషల్ ఉపాధ్యాయుడు డి.రాజబాబును సస్పెండ్ చేసినట్టు గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. శనివారం పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, డీడీ కొండలరావుతో కలిసి డౌనూరు పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని సోషల్ సబ్జెక్టులో పరిశీలించారు. వారి సమాధానాలు సంతృప్తికరంగా లేకపోవడంతో ఆగ్రహానికి గురయ్యారు. వాటికి సోషల్ ఉపాధ్యాయుడు కూడా సమాధానం చెప్పలేకపోవడంతో ఆయనతో క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. బోధనలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. మెనూ పాటించి నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించేలా ప్రణాళికపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై వార్డెన్లు, ఉపాధ్యాయులు ప్రత్యేకశ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంబసింగిలోని బాలికల ఆశ్రమ పాఠశాల సోషల్ టీచర్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డైరెక్టర్

మ్యూజియం పనులు వేగవంతం

చింతపల్లి రూరల్: తాజంగిలో నిర్మిస్తున్న స్వాతంత్ర సమరయోధుల మ్యూజియం నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ జేవీ మురళి ఆదేశించారు. శనివారం మండలంలో పర్యటించిన ఆయన మ్యూజియం నిర్మాణ పనులను పరిశీలించారు. జూన్ నాటికల్లా సమరయోధుల శిల్పాలు, ఆకృతులను అమర్చేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. రూ.2.80 కోట్లతో నిర్మిస్తున్న కొమ్మంగి –ఉరిసింగి రోడ్డు పనులను ఆయన పరిశీలించారు.అనంతరం లంబసింగి గిరిజన సంక్షేమశాఖ బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థినులను అడిగిన ప్రశ్నలకు సరియైన సమాధానాలు చెప్పకపోవడంతో ఆయన అసంతృప్తికి గురయ్యారు. సోషల్ టీచర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. రాష్ట్రంలో గిరిజన జనాభా 27 లక్షల మంది ఉండగా వీరిలో 40 సంవత్సరాలోపు వయసు వారికి సికిల్ ఎనీమియా నిర్ధారణకోసం స్క్రీనింగ్ జరుగుతోందన్నారు. ఇప్పటివరకు నాలుగు లక్షల మందికి స్క్రీనింగ్ చేయగా 1500మందికి నిర్ధారణ అయిందన్నారు. పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, గిరిజన సంక్షేమ శాఖ ఈఎన్‌సీ శ్రీనివాస్, గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు, ఈఈ డీవీఆర్‌ఎం రాజు, డీఈ చాణిక్య, జేఈ రఘు, ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి, వార్డెన్ వినాయకరావు పాల్గొన్నారు.



స్వాతంత్ర సమరయోధుల మ్యూజియం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డైరెక్టర్ మురళి, పీవో

7 నుంచి మత్స్యగుండం జాతర

ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష

సాక్షి,పాడేరు: పవిత్ర పుణ్యక్షేత్రం హుకుంపేట మండలం మత్స్యగుండంలో వచ్చే నెల 7,8,9 తేదీల్లో జరిగే మహాశివరాత్రి జాతరను ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగమంతా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు ఏయాలని సబ్‌కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి చక్రవర్తి ఆదేశించారు. శనివారం సబ్‌కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పలుశాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన సూచనలు చేశారు. భక్తులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా సురక్షిత తాగునీరును కుళాయిల ద్వారా 24గంటల పాటు అందుబాటులో ఉంచాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. పారిశుధ్యం, విద్యుత్ సరఫరాపై దృష్టి సారించాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం లేకుండా పోలీసు బందోబస్తు చేపట్టాలని,ఉత్సవాల మూడు రోజులు మత్స్యగుండంకు 15 ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని పోలీసు,ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.అగ్ని ప్రమాదాలతో పాటు మత్స్యగెడ్డలో ప్రమాదాల నివారణ లక్ష్యంగా అగ్నిమాపకశాఖ తగిన చర్యలు తీసుకోవాలని, గెడ్డ ప్రాంతంలో గజ ఈతగాళ్లను కూడా సిద్ధం చేయాలన్నారు. పాడేరు మండలం చింతలవీధి జంక్షన్ నుంచి మఠం గ్రామం వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఉత్సవ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశాలిచ్చారు. పాడేరు, హుకుంపేట ఎంపీడీవోలు సాయి నవీన్,వెంకటరావు,ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు, డీఎల్పీవో కుమార్, విద్యుత్ పంపిణీ సంస్థ డీఈఈ మల్లేశ్వరరావు, మఠం సర్పంచ్ శాంతకుమారి, ఆలయ కమిటీ సభ్యులు టి.అప్పారావు, ఎం.సూర్యనారాయణ, ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపాలరావు, మత్స్యకొండబాబు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పలుశాఖల అధికారులు

జాబ్‌మేళాకు మరో ఆరు కంపెనీలు

ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

చింతూరు: ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈనెల 27న చింతూరులో నిర్వహించనున్న జాబ్‌మేళాలో అదనంగా మరో ఆరు కంపెనీలు పాల్గొంటున్నట్లు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య తెలిపారు. జాబ్‌మేళా నిర్వహించేందుకు తొలుత ఎనిమిది కంపెనీలు ముందుకు రాగా యువతకు అధికంగా ఉపాధ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో మరో ఆరు కంపెనీలను ఒప్పించినట్టు ఆయన తెలిపారు. దీని ద్వారా మరో 300 మందికి ఉద్యోగావకాశాలు లభించే అవకాశముందన్నారు. దీనికి సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేసేలా సమీక్ష నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అర్హులైన నిరుద్యోగ యువత తమ పరిధిలోని గ్రామ సచివాలయాల్లో డిజిటల్, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ల ద్వారా ఉద్యోగాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పీవో సూచించారు. నమోదు చేసుకున్నవారు అడ్మిట్ కార్డు తీసుకుని ఈనెల 27న స్థానిక గురుకుల పాఠశాల ఆవరణలో జరిగే జాబ్‌మేళాకు హాజరు కావాలని ఆయన సూచించారు. అనివార్య కారణాల వల్ల నమోదు కాని అభ్యర్థులకు హెల్ప్ డెస్క్ ద్వారా ఆన్‌లైన్ నమోదు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

క్లుప్తంగా

విద్యార్థులకు సత్వర వైద్యం

- ఐటీడీఏ పీవో అభిషేక్

కొయ్యూరు: స్థానిక గురుకుల పాఠశాలలో ముగ్గురు విద్యార్థులకు వైరల్‌జ్వరాలు రావడంపై ఐటీడీఏ పీవో వి.అభిషేక్ వెంటనే స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు టీడబ్ల్యూ డీడీ కొండలరావు శనివారం సాయంత్రం పాఠశాలను సందర్శించారు. మొత్తం 250 మంది విద్యార్థులకు వైద్యులు మనోజ్ఞ ఆధ్వర్యంలో రక్త పరీక్షలు చేశారు. ఒక విద్యార్థిని పాడేరు ఏరియా ఆస్పత్రికి తరలించగా, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. పాఠశాలను డీఎంహెచ్‌వో ఆదివారం పాఠశాలను సందర్శించనున్నట్టు డీడీ కొండలరావు చెప్పారు. సికిల్‌సెల్ ఎనీమియాకు సంబంధించి పాడేరు డివిజన్ 117 ఆశ్రమ పాఠశాలల్లో 34 వేల మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని బాలికల పాఠశాలల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల్లో తెలుగులో 15 మందికి గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1కి, హిందీలో 21 మందికి గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1కు ,19 పీఈటీలకు పీడీలుగా పదోన్నతి కల్పిస్తామని తెలిపారు. ప్రిన్సిపాల్ టీవీ మోహన్ పాల్గొన్నారు.

సూర్యదేవాలయ నిర్మాణానికి నిధులు

- రూ.50 లక్షల మంజూరు



సాక్షి,పాడేరు: డి.గొందూరు పంచాయతీ సూకురుపుట్టులో సూర్యనారాయణ మూర్తి దేవాలయం నిర్మాణానికి దేవాదాయ, ధర్మాదాయశాఖ రూ.50 లక్షలు మంజూరు చేసింది. విశ్వహిందూ పరిషత్ ప్రతినిధి, ఆధ్యాత్మిక గురువు రామకృష్ణ పరమహంస స్వగ్రామమైన సూకురుపుట్టులో సూర్యదేవాలయం నిర్మాణానికి రెండేళ్ల క్రితం శ్రీకారం చుట్టారు. ఆలయం పూర్తిస్థాయిలో నిధులు మంజూరు కావడంతో స్థానిక గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు.

భక్త జన తరంగాలు



పూడిమడక తీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు, (ఇన్‌సెట్) తీరంలో స్నానాలకు ముందు బ్రహ్మముడులు వేసుకుని సముద్రునికి పూజలు చేస్తున్న భక్తులు

- తీర ప్రాంతాల్లో మాఘ పౌర్ణమి పుణ్యస్నానాలు
- సముద్రుడికి పూజలు చేసిన లక్షలాదిమంది భక్తులు

ఎస్.రాయవరం/అచ్యుతాపురం/రాంబిల్లి: మాఘ పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని ప్రధాన తీర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. పూడిమడక, రేవుపోలవరం, వాడపాలెం తదితర సముద్ర తీరాల్లో లక్షలాదిమంది భక్తులు శనివారం తెల్లవారుజాము నుంచి పుణ్యస్నానాలు ఆచరించారు. సముద్రుడికి పూజలు నిర్వహించారు. నూతన వధూవరులు, దంపతులు బ్రహ్మముడులు వేయించుకుని పుణ్యస్నానాలు చేశారు. కుటుంబంలో అకాల మరణం చెందినవారికి తర్పణాలు వదిలారు. రేవుపోలవరం తీరంలో వెలసిన శ్రీ లక్ష్మీమాధవస్వామిని దర్శించుకున్నారు. సుమారు లక్షకు పైగా భక్తులు వచ్చినట్టు అధికారుల అంచనా. నర్సీపట్నం డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడిపి భక్తులను సురక్షితంగా తరలించారు.

తీరానికి తరలివచ్చిన భక్తులకు సేవలు అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగంతో పాటు సత్యసాయి సేవా సంస్థలు, పలు యువజన సంఘాలు పోటీపడ్డాయి. నర్సీపట్నం డీఎస్పీ వెంకట్రామయ్య ఆధ్వర్యంలో నక్కపల్లి సీఐ అప్పన్న బందోబస్తు నిర్వహించారు. రాంబిల్లి శివారు వాడపాలెం తీరంలో భక్తులు పెద్ద సంఖ్యలో పుణ్యస్నానాలు ఆచరించి ఆరోగ్య ప్రదాత సూర్యభగవానుడికి నమస్కరించారు. గంగదేవి ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మాఘ పౌర్ణమి జాతరలో భాగంగా పూడిమడక తీరంలో తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా పోటెత్తారు. సముద్ర తీరాన ఏర్పాటు చేసిన స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు. పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు జగన్నాథ స్వామిని కొలిచారు. పోలీసులు, మెరైన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అనకాపల్లి నుంచి ఆర్టీసీ బస్సు సర్వీసులను నడిపారు.



పూడిమడక తీరానికి పోటెత్తిన భక్తులు

జీసీసీలో 41 మందికి పదోన్నతులు



ఉద్యోగులకు ఉత్తర్వులు అందజేస్తున్న జీసీసీ, జెడ్పీ చైర్‌పర్సన్లు స్వాతిరాణి, సుభద్ర, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జీసీసీ వైస్ చైర్మన్, ఎండీ సురేష్ కుమార్

మహారాణిపేట: గిరిజన సహకార సంస్థ(జీసీసీ)లో 20 నుంచి 30 ఏళ్లకు పైబడి సేల్స్‌మన్ క్యాడర్‌లో పని చేస్తున్న 41 మందికి జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించి, పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. జీసీసీ ప్రధాన కార్యాలయంలో పదోన్నతి పొందిన ఉద్యోగులకు చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి, జీసీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్‌కుమార్ శనివారం నియామక ఉత్తర్వులు అందజేశారు. పదోన్నతులు పొందిన 41 మందిలో 39 మంది షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారు ఉన్నారు. తమ అర్హతలు, సేవలు గుర్తించి పదోన్నతులు కల్పించినందుకు గానూ జీసీసీకి, రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. జనరల్ మేనేజర్(పరిపాలన) జె.యాస్టస్, డివిజనల్ మేనేజర్(రంపచోడవరం) జి.పార్వతీశ్వరావు, అధికారులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

నాతవరం: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్‌ఐ రామారావు తెలిపారు. మండలంలో నర్సీపట్నం, తుని మధ్య తాండవ జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా 10 కిలోల గంజాయితో ఆటోలో వస్తున్న ఇద్దరు వ్యక్తులు పట్టుబడినట్టు చెప్పారు. కేరళ రాష్ట్రానికి చెందిన కె.శివన్, పి.డి. మోహన్‌దాస్‌లపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

గిరిజన యువతి ఆత్మహత్య



సంఘటన స్థలం వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

రంపచోడవరం: ప్రేమికుడితో పెళ్లి చేసేందుకు అతడి కుటుంబ సభ్యులు నిరాకరించడంతో మనస్థానానికి గురైన గిరిజన యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన రంపచోడవరంలోని సిరిగిందలపాడు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కారం సంధ్య(23) ఉదయం తన ఇంటి వద్దే వివిధ రకాల మాత్రలు మింగి, నైల్ పాలీష్ తాగడంతో మృతి చెందినట్లు సీఐ వాసా వెంకటేశ్వరరావు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

399 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు



రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

రంపచోడవరం: రంపచోడవరం నియోజకవర్గంలో రానున్నఎన్నికల కోసం 399 పోలింగ్ బూత్‌లను సిద్ధం చేసినట్టు రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. .రంపచోడవరంలో శనివారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఓటర్ల చేర్పులు మార్పులపై సమావేశం నిర్వహించారు. బీఎల్‌వోలు ప్రతీ ఇంటికి వెళ్లి తప్పులు సరిచేశామన్నారు. రంపచోడవరం నియోజకవర్గంలో 2,75,650 ఓట్లు ఉన్నట్టు తెలిపారు. డోర్ నెంబర్లు లేని ఇళ్లకు డోర్ నెంబరులు ఇవ్వడం జరుగుతుందన్నారు. వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన ప్రతినిధులకు ఈవీఎంలు పై అవగాహన కల్పించినట్టు చెప్పారు. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముందు రోజు వరకు ఓటర్ల జాబితాలో ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత ఫారములు ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. రంపచోడవరం నియోజకవర్గం పరిధిలో చనిపోయిన వారి పేర్లు పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాతే ఓటరు జాబితా నుంచి తొలగించడం జరుగుతుందన్నారు. వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, పి.శ్రీనివాసరావు, చుక్కా సంతోష్‌కుమార్, ఎం.వాణిశ్రీ , సిద్ధ వెంకన్నబాబు, పి.అనంతమోహన్, తహసీల్దార్ ఎ.కృష్ణ జ్యోతి, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్లు ఎన్.వి.వి. సత్యనారాయణ, సుబ్బారావు, బి.రాజు, సీనియర్ అసిస్టెంట్లు లక్ష్మణ్. ఇందిరాబాయ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ, సీపీఎం నేతల చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు

చింతూరు: మండలంలోని గూడూరు రాజుపేట గుంపులో టీడీపీ, సీపీఎం పార్టీలకు చెందిన 18 కుటుంబాలు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. పార్టీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ కోట్ల కృష్ణ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారరు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు తమవంతు కృషి చేస్తామని పార్టీలో చేరిన నాయకులు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో బొద్దెల వీరయ్య, బొద్దెల రామయ్య, తెల్లం రామయ్య, సున్నం ఎర్రయ్య, మడివి సుబ్బయ్య, మడివి రత్తయ్యలు ఉన్నారు.ఎంపీటీసీ సభ్యురాలు సున్నం గౌరమ్మ, సర్పంచ్ మడివి బొజ్జి, మండల బూత్ కన్వీనర్ మడివి ప్రవీణ్, జోగారావు, ముత్తయ్య, రామయ్య, భీమయ్య పాల్గొన్నారు.

సేవాగుణం, దైవభక్తి కలిగి ఉండాలి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్, ప్రతినిధులు



పాల్గొన్న భక్తులు

- శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్
- గడుగుపల్లిలో ప్రేమామృత సేవా నిలయం ప్రారంభం

హుకుంపేట: సేవాగుణం, దైవభక్తి కలిగి ఉండాలని శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ సూచించారు. మండలంలో తాడిపుట్టు పంచాయతీ గడుగుపల్లి గ్రామంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో భగవన్ శ్రీ ప్రేమామృత సేవా నిలయాన్ని శనివారం ప్రారంభించి విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో శ్రీ సత్యసాయి మందిరం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. భక్తులు గిరిజన ప్రజలు నిత్యం సుఖ సంతోషాలతో ఉండాలంటే సేవాగుణం కలిగి నిత్యం దైవారాధన కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. అన్నసమారాధన ఏర్పాటుచేశారు. అంతకు ముందు రత్నాకర్‌కు భారీ బైక్ ర్యాలీ, థింసానృత్యాలతో ఘన స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించారు. ప్రశాంతి పతాకాన్ని ఎగురవేశారు.ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు సత్యసాయి గ్లోబల్ కౌన్సెల్ వైస్‌చైర్మన్ నిమీష్ పాండ్యా, సంస్థ సభ్యులు కోటేశ్వరరావు, లక్ష్మణరావు గణేష్ ,జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు విశ్వేశ్వరరావు, ఎంపీపీ కూడా రాజబాబు పాల్గొన్నారు.